సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



మలేరియాకు చెక్

మలేరియాపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏప్రిల్ 25వ తేదీని ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంగా ప్రకటించింది. మంగళవారం జిల్లాలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,020
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,540
3 శాతం జీఎస్టీతో	రూ.5,706
సవర (8 గ్రా)	రూ.45,648

గరిష్టం/కనిష్టం
35.4 /24.1

వాతావరణం

సోమవారం గాలిలో 73 శాతం తేమ ఉంది. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. అలాగే మంగళవారం అక్కడక్కడా జల్లులు పడొచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మేయర్ ఓవరాక్షన్

- నెల్లూరు కార్పొరేషన్‌లో సర్వసభ్య సమావేశం
- సమావేశ మందిరంలో సీఎం చిత్రపటం ఏర్పాటుపై స్రవంతి ఆగ్రహం
- క్షమాపణలు చెప్పాలంటూ కార్పొరేటర్ల డిమాండ్
- మేయర్‌గా కొనసాగే హక్కు లేదంటూ నినాదాలు
- సమావేశ మందిరంలోకి చొచ్చుకొచ్చిన రూరల్ ఎమ్మెల్యే మద్దతుదారులు



మేయర్ క్షమాపణలు చెప్పాలంటూ సమావేశ మందిరంలో బైఠాయించిన కార్పొరేటర్లు

నెల్లూరు(బారకాసు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉంటుంది. అలాగే నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం సమావేశం మందిరంలోనూ ఏర్పాటు చేశారు. అయితే కార్పొరేషన్ మేయర్ పొట్లూరు స్రవంతి రాజకీయ దురుద్దేశంతో సీఎం చిత్రపటం విషయంలో వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఆ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అజెండాలోని అంశాలపై చర్చించారు. ఈక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ గోతం అరుణ సీఎం ఫొటోను సమావేశ మందిరంలో పెట్టడంపై ధన్యవాదాలు తెలిపారు. దీంతో వెంటనే మేయర్ తన వెనుక వైపు ఉన్న సీఎం జగన్ ఫొటోని చూసి దీనిని ఇక్కడెవరు ఏర్పాటు చేశారని అధికారులను ప్రశ్నించారు. వెంటనే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మొయిళ్ల గౌరి, కర్తం ప్రతాప్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్, మూలే విజయభాస్కర్‌రెడ్డి తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే మనం ఇక్కడ ఉన్నామనే విషయాన్ని గుర్తించుకోవాలని మేయర్‌కు సూచించారు. 'మీ మాటలు సీఎంను అవమానపరిచినట్లుగా భావిస్తున్నాం. కాబట్టి వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి. లేకుంటే రాజీనామా చేయాలి.' అని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు.

మేయర్ డ్రామా

భోజన విరామం తర్వాత సర్వసభ్య సమావేశాన్ని కొనసాగించారు. అయితే మేయర్ తనను కార్పొరేటర్లు అవమానించారని, వారిపై తాను పోలీస్ కేసు పెడతానని డ్రామాకు తెరతీశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము స్రవంతిని గౌరవించామే తప్ప ఏనాడు అగౌరవపరచలేదన్నారు. సీఎం ఫొటో, సమస్యలపై ప్రశ్నిస్తే అవమానపరిచినట్లా.. ఎందుకు మాపై పోలీస్ కేసులు పెడతారని ప్రశ్నించారు. దీంతో కొంతసేపు మేయర్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మద్దతు కార్పొరేటర్లకు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు వాగ్వాదం జరిగింది. చివరికి మేయర్ అజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నామంటూ సమావేశాన్ని ముగించి అర్ధాంతరంగా వెళ్లిపోయారు.

పోలీసులపై కమిషనర్ ఆగ్రహం

సర్వసభ్య సమావేశం జరుగుతున్న క్రమంలో ఒకానొక దశలో సీఎం ఫొటో ఏర్పాటు విషయమై మేయర్‌కు, కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు పోలీసులు సమావేశ మందిరం బయట ఉండిపోవడంతో కమిషనర్ వికాస్ మర్మత్ బయట ఏం చేస్తున్నారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

కాగా సమావేశంలో పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్లలో ఉన్న సమస్యల గురించి ప్రస్తావించారు. టీచర్స్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమావేశానికి విచ్చేసి కార్పొరేషన్‌కు సంబంధించి ఏవైనా అవసరమైతే సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. అజెండాలో పొందుపరిచిన షాదీమంజిల్ విషయమై డిప్యూటీ మేయర్లు ఖలీల్ అహ్మద్, రూప్‌కుమార్ మాట్లాడారు. షాదీమంజిల్‌కు నామమాత్రపు బాడుగ ఉండేలా చూడాలని, ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. ఇందుకు కార్పొరేటర్లు మద్దతు తెలిపారు. సభ్యులు ప్రతిపాదించిన షాదీమంజిల్ అంశాన్ని ఆమోదించారు. వైఎస్సార్‌సీపీ 48వ డివిజన్ కార్పొరేటర్ తహసిన మాట్లాడుతూ షాదీమంజిల్‌లో శుభకార్యాలయాలు చేసుకునేందుకు సామగ్రి కోసం నిధులు అవసరమైతే విరాళాలు ద్వారా సేకరించి ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకు తాను రూ.లక్ష విరాళాన్ని అందించేందుకు సిద్ధంమంటూ తన ప్రతిపాదన పత్రాన్ని మేయర్‌కు అందజేశారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ కార్యాలయ అన్ని విభాగాల అధికారులకు ఎలక్ట్రికల్ కార్లను ఏర్పాటు చేస్తే ఒక్క ఆరోగ్యాధికారి మినహా మిగిలిన అధికారులందరూ వాటిని వాడుతున్నారని చెప్పారు. ప్రైవేట్ వాహనాన్ని వాడుతూ నెలకు సుమారు రూ.40 వేలు చెల్లిస్తూ ప్రజాధనాన్ని అనవసరంగా ఎందుకు ఖర్చు చేస్తున్నారంటూ ప్రశ్నించారు. కో–ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగం అక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి రోడ్లను కూడా అక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని మేయర్‌కు సమర్పించారు.



మేయర్‌ను నిలదీస్తున్న కార్పొరేటర్లు

రౌడీలు ఎలా వస్తారు?

కౌన్సిల్ సమాశ మందిరంలో సమావేశం జరుగుతున్న సమయంలో రౌడీలు ఎలా వచ్చారంటూ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ మేయర్‌ను ప్రశ్నించారు. సంబంధం లేని వ్యక్తులను సమావేశ మందిరంలోకి ఎవరు రానిస్తున్నారని, వారికి ఇక్కడ ఏం పని అని ప్రశ్నించారు. వాళ్లంతా అసభ్యకరపదజాలంతో మాట్లాడుతున్నారని ఇదంతా వెనకనుంచి ఎవరో చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచిపద్ధతి కాదని హెచ్చరించారు.

వ్యతిరేకంగా నినాదాలు

సీఎం ఫొటో విషయంలో మేయర్ మాటలకు కార్పొరేటర్లు కోపోద్రిక్తులైన కార్పొరేటర్లు మేయర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ అక్కడ బైఠాయించారు. ఈక్రమంలోనే కొంత మంది రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి చెందిన మద్దతుదారులు సమావేశ మందిరంలోకి చొచ్చుకొచ్చారు. కేకలు వేస్తూ సభ్యులను అసభ్యకరపదజాలంతో మాట్లాడారు. దీంతో గందరగోళం నెలకొంది. ఈక్రమంలో స్రవంతి సమావేశాన్ని కొంత సమయం వరకు వాయిదా వేస్తున్నానని ప్రకటించి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. కార్పొరేటర్లు మేయర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ అక్కడ బైఠాయించారు. కాసేపటికి ఆమె తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. 30 నిమిషాల తర్వాత తిరిగి వచ్చారు. అయితే కార్పొరేటర్లంతా ముందుగా సీఎం చిత్రపటంపై మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని ఆ తర్వాత సమావేశాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు మేయర్ సీఎం ఫొటో ఏర్పాటు చేయడం తనకు ఇష్టమేనని.. అయితే తాను మాట్లాడిన మాటల్లో తప్పు లేదని, అయినా కూడా మాటల్ని వెనక్కి తీసుకుంటున్నానని చెప్పారు. దీంతో కార్పొరేటర్లంతా జై జగనన్న.. జై జగనన్న అంటూ నినాదాలు చేశారు.



సమావేశ మందిరంలోకి దూసుకొస్తున్న రూరల్ ఎమ్మెల్యే మద్దతుదారులు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు

'కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేశారు'

నెల్లూరు(క్రైమ్): తనను, సహచర కార్పొరేటర్‌ను కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేయడమే కాకుండా అడ్డొచ్చిన మరో కార్పొరేటర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని 53వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ సుజాత సోమవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోని ఎవరు పెట్టారంటూ మేయర్ పొట్లూరి స్రవంతి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సుజాతతోపాటు 50వ డివిజన్ కార్పొరేటర్ జయలక్ష్మి ముఖ్యమంత్రి ఫొటో ఉంటే తప్పేంటి అని మేయర్‌ను ప్రశ్నించారు. రిజర్వేషన్ల కింద కార్పొరేటర్లు అయిన మీకు మేయర్‌ను ప్రశ్నించే దమ్ము, ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందంటూ 19వ డివిజన్ కార్పొరేటర్ జ్యోతిప్రియ, కో–ఆప్షన్ సభ్యురాలు వహీద వారిపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. నానా దుర్భాషలాడారు. ఈక్రమంలో మేయర్ గదిలో నుంచి బయటకు వచ్చిన 19వ డివిజన్ కార్పొరేటర్ భర్త మదన్, మేయర్ భర్త జయవర్ధన్, నాయకులు చక్కా సాయిసునీల్, కరణం హజరత్‌నాయుడు, మంజుల, షంషుద్దీన్ మరో ఏడుగురు సుజాత, జయలక్ష్మిపై దౌర్జన్యం చేశారు. భయభ్రాంతులకు గురిచేసి వారిని కిందకు తోసేసి కులం పేరుతో దూషించి అసభ్యకర పదజాలంతో దుర్భాషలాడారు. 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా వారు ఆమెను సైతం అసభ్య పదజాలంతో దూషించి తోయడంతో కిందపడిపోయారు. దీంతో గౌరీకి గాయాలయ్యాయి. తనను, జయలక్ష్మిని కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేయడమే కాకుండా అడ్డొచ్చిన గౌరీపై దాడిచేసిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుజాత దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- సమావేశంలో పలువురు కార్పొరేటర్లు తనపట్ల దురుసుగా ప్రవర్తించారని మేయర్ స్రవంతి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇరువర్గాల ఫిర్యాదులపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

బుక్ డిపో మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని పాఠ్యపుస్తకాల బుక్ డిపో మేనేజర్ అశోక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ విద్యాసంస్థలకు పాఠ్యపుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించింది. ఆయా యాజమాన్యం పాఠశాలలు విద్యాశాఖ కమిషనర్ పేరు మీద డీడీ రూపంలో తీసి ఎంఈఓకు అందజేశారు. వారికి సేల్స్ పాఠ్యపుస్తకాలు మాత్రమే అందజేయాల్సి ఉంది. అయితే ఫ్రీ బుక్స్ సరఫరా చేశారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు గత సంవత్సరం నవంబర్‌లో ఫిర్యాదు అందింది. ఇంకా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కమిషనర్ విచారించాలని ఆర్జేడీ సాయిసుబ్బారావు, డైట్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. విచారణ చేపట్టిన అధికారులు పది ప్రైవేట్ పాఠశాలల్లో ఫ్రీ బుక్స్ ఉన్నట్లు గుర్తించి కమిషనర్‌కు నివేదిక పంపించారు. దీంతోపాటు ఈ ఏడాది జనవరిలో ప్రైవేట్ స్కూళ్లకు ఫ్రీ బుక్స్ సరఫరాపై విచారించాలని ఆర్డీఓ, తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. వారు బుక్ డిపోకు వెళ్లి సేల్ బుక్స్, ఫ్రీ బుక్స్‌ను పరిశీలించి నివేదిక అందజేశారు. ఆర్జేడీ, డైట్ ప్రిన్సిపల్ నివేదికను కమిషనర్‌కు పంపించగా పరిశీలించి కొద్దిరోజుల క్రితం అశోక్‌ను సస్పెండ్ చేశారు. ఈ విషయంపై ఆర్జేడీ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ఫ్రీ బుక్స్ సరఫరా చేశారన్న ఫిర్యాదుపై విచారించి నిజమని తేలడంతో సస్పెండ్ చేసినట్లు సోమవారం తెలిపారు.

ప్రజలకు అవసరమైన వసతులు కల్పించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- జెడ్పీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- అవార్డుల అందజేత



అవార్డులు స్వీకరించిన సర్పంచ్‌లతో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారులు

నెల్లూరు(పొగతోట): 'పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు అవసరమైన వసతులు కల్పించాలి. అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి.' అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడారు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన రోజును పంచాయతీరాజ్ దినోత్సవంగా చేసుకుంటున్నామని చెప్పారు. ఇది గ్రామస్థాయిలో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థ అన్నారు. గ్రామ పంచాయతీలకు విస్తృత అధికారాలు ఇవ్వడం ద్వారా ప్రజలకు అవసరమైన పనులు నిర్వహించుకునే వెసులుబాటు ఉందన్నారు. దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను అమలు చేసిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ముత్తుకూరు మండలం మల్లూరు గ్రామ పంచాయతీకి పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనోపాధుల కల్పనకు సంబంధించి రాష్ట్రస్థాయిలో అవార్డు వచ్చిందని, దీనికి కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం 23 పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులను సన్మానించి అవార్డులు అందజేశారు.

మంత్రి కాకాణి సహకారంతో అవార్డు



సర్పంచ్ విజయకుమార్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతోనే మల్లూరు పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు వచ్చిందని సర్పంచ్ దువ్వూరు విజయకుమార్‌రెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 'పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హాన్స్‌డ్ లైవ్లీ హుడ్' విభాగంలో ప్రభుత్వం మల్లూరు పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. అమరావతిలో సోమవారం పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి చేతుల మీదుగా విజయకుమార్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్లూరులోని అత్యధిక కుటుంబాల నుంచి ఒకరు చుట్టుపక్కల కృష్ణపట్నం పోర్టు, ఇతర పరిశ్రమల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగాల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. దీంతో ప్రశాంత వాతావరణలో గ్రామస్తులు జీవనం సాగిస్తున్నారన్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

- ప్రతిపక్షాలకు నిద్ర కరువైంది
- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నెల్లూరులోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నట్లు వెల్లడైందన్నారు. తాజాగా వెలువడిన ఓ సర్వేలో 2024 ఎన్నికల్లో 25కి 24 ఎంపీ స్థానాలు గెలిచి వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని తెలపడంతో ప్రతిపక్షాలకు నిద్రపట్టడం లేదన్నారు. గతంలో కూడా ఇదే సంస్థ సర్వే చేసి చెప్పిన విధంగానే ఫలితాలు రావడంతో ప్రస్తుతం ఇతర పార్టీల్లో భయం పుట్టిందన్నారు. తమ ప్రభుత్వంలో చెడు కనిపించకపోవడంతో వారి అనుకూల మీడియాలో ఇష్టమొచ్చినట్లు పచ్చరాతలు రాయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే తాము నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చి స్వయంగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మండలాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ వచ్చేలా అహర్నిశలు కృషి చేస్తామని నాయకులు ముక్తకంఠంతో తెలిపారు. సమావేశంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పెయ్యల సంపూర్ణమ్మ, చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్, కంటాబత్తిన రఘునాథరెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్లు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

న్యూస్‌రీల్

ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి నియామకం

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ (నెల్లూరు, వైఎస్సార్ కడప, తిరుపతి) జిల్లాలకు సంబంధించి ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జిని నియమించారు. తిరుపతికి చెందిన ఎస్పీ దేవదానంను నియమించినట్లు పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి 25వ తేదీన జిల్లాకు రానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు తడ నుంచి బయటలుదేరి 5.30 గంటలకు వెంకటాచలం చేరుకుంటారు. తొలుత స్వర్ణభారత్ ట్రస్ట్‌ను సందర్శిస్తారు. తర్వాత అక్షర విద్యాలయంలో వార్షికోత్సవంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు బయలుదేరి చెన్నైకి వెళ్తారు.

27న డీఎస్సీ–98 అభ్యర్థులకు రెండో విడత కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): డీఎస్సీ–98 అభ్యర్థులకు రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల 27వ తేదీన జరుగుతుందని డీఈఓ గంగాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్ట్ ప్రకారం ఇప్పటికే 239 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. దీనికి గైర్హాజరైన 14 మంది స్థానంలో జాబితాలో తర్వాత ఉన్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఈ జాబితాను www. deonellore.50 webs. com వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. సదరు అభ్యర్థులు రూ.100 స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్‌ను సమర్పించాలన్నారు.

109 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్స్

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ఎంపిక చేసిన 109 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్స్ చేసుకోవచ్చని జిల్లా రిజిస్ట్రేషన్స్ అధికారి బాలాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ ఇచ్చామన్నారు.

సోమశిలలో 51.680 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 51.680 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 201 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కులు, వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 96.610 మీటర్లు ఉంది.

స్త్రీనిధి ఏజీఎంగా కామాక్షయ్య



పీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏజీఎం

నెల్లూరు(పొగతోట): డీఆర్‌డీఏ స్త్రీనిధి ఏజీఎంగా కామాక్షయ్య సోమవారం నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్వయం సహాయక గ్రూపు మహిళలకు స్త్రీనిధి రుణాలు సకాలంలో అందజేసేలా చర్యలు తీసుకుంటామని ఏజీఎం తెలిపారు. కాగా నెల్లూరులో ఏజీఎంగా పని చేస్తున్న హేమంత్‌కుమార్ తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు.

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు బుధవారం నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఆ శాఖాధికారి అందెల సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో మార్కెటింగ్, రికవరీ ఎగ్జిక్యూటివ్స్ తదితర పోస్టులు ఉన్నాయన్నారు. ఏదైనా డిగ్రీ, ఐటీఐ చదివి 28 సంవత్సరాల్లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చర్స్ కంపెనీలో హెల్పర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్ తదితర పోస్టులు ఉన్నాయన్నారు. 18–35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఐటీఐ ఎలక్ట్రికల్/ మెకానికల్/ఆటోమొబైల్ చదివిన వారు అర్హులన్నారు. జీతం రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎన్‌సీఎస్ పోర్టల్‌లో తమ పేరు, వివరాలను రిజిస్టర్ చేసేందుకు ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

మలేరియాకు చెక్

దోమలు అనేక వ్యాధులకు కారణమవుతున్నాయి. మలేరియా తదితర వ్యాధులను వ్యాప్తి చేస్తూ మనుషుల ప్రాణాలు తీస్తున్నాయి. ఒకప్పుడు మలేరియా వస్తే రోగి ప్రాణాలు కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడాల్సివచ్చేది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినప్పటికీ కొన్నిచోట్ల మలేరియా వ్యాధితో పలువురు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు నేటికీ ఉన్నాయి. అవగాహనతోనే మలేరియా వ్యాప్తికి చెక్ పెట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- దోమల నివారణతోనే సాధ్యం
- అవగాహనతోనే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా నియంత్రణ
- నేడు మలేరియా నివారణ దినోత్సవం

నెల్లూరు(అర్బన్): మలేరియా వ్యాధిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ఈ వ్యాధిని నియంత్రించవచ్చు. మలేరియాపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంగా ప్రకటించింది. అందులో భాగంగా జిల్లాలో సైతం మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో పరిస్థితి

జిల్లాలోని రాపూరు, సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి తదితర అటవీ సమీప ప్రాంతాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రధానంగా రాపూరు మండలంలో గత కొన్నేళ్లుగా మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. 2011 వరకు మున్సిపాలిటీల్లో సైతం జిల్లా మలేరియా విభాగం మలేరియా నిర్మూలన చర్యలు చేపట్టేది. అయితే ఆ తర్వాత మున్సిపాలిటీలకే నివారణ బాధ్యత అప్పగించినప్పటికీ ప్రజారోగ్యశాఖ ఆ బాధ్యతలు పట్టించుకోవడం లేదు. మలేరియా శాఖే కొంతవరకు మున్సిపాలిటీల్లో బాధ్యతలు నిర్వర్తిస్తోంది.



పొట్టేపాళెం వద్ద కాలనీలోని నీటిగుంతలో గంబూసియా చేపలు వదులుతున్న వైద్యసిబ్బంది(ఫైల్)

జిల్లాలో చేపట్టిన చర్యలు

జిల్లాలో ఉన్న 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మలేరియా విభాగం ప్రత్యేకంగా 4,722 కిలోల మిలాథియాన్ పౌడర్, పైరిత్రియాన్ లిక్విడ్ 172 లీటర్లు, సైఫనో త్రియాన్ రసాయనం 1,062 లీటర్లు, బీటీఐ పౌడర్ 764 కిలోలు, లిక్విడ్ 845 లీటర్లను ఈ సంవత్సరం పంపిణీ చేసింది. ప్రత్యేకించి 232 సంక్షేమ వసతి గృహాల్లో మే, జూన్ మాసాల్లో మలేరియా నివారణకు ఈ ద్రావణాలను స్ప్రే చేశారు. గతంలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదైన రాపూరు మండలంలో 57,900 దోమతెరలను పంపిణీ చేశారు. ప్రస్తుతం 32,559 దోమతెరలు అవసరమని మలేరియా విభాగం ప్రభుత్వానికి నివేదించింది. ప్రతి శుక్రవారం పీహెచ్‌సీల పరిధిలో దోమల నివారణకు డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే ఇది మొక్కుబడిగా జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. పక్కాగా డ్రైడే నిర్వహిస్తే దోమలను అరికట్టి తద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. జిల్లాలో అవసరమైన ల్యాబ్ టెక్నీషియన్లు, రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల పరీక్షలు భారీస్థాయిలో చేస్తే అధికారులు పేర్కొన్నట్లు కాకుండా మరిన్ని కేసులు వెలుగు చూసే అవకాశం ఉందని తెలుస్తోంది.



తొట్టెలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

ముందస్తు జాగ్రత్తలతో..

లార్వా దశలోనే దోమల నివారణ చర్యలు చేపడితే దోమల నియంత్రణ జరిగి వ్యాధులను అరికట్టవచ్చు. ప్రజలు ఇళ్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్, కిరోసిన్ లాంటి ద్రావణాలను వేస్తే దోమల గుడ్లు చనిపోయి దోమల నియంత్రణ జరుగుతుంది. ప్రజలు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటుకు గురికాకుండా చూసుకోవచ్చు. ప్రభుత్వం సూచించిన విధంగా ఫ్రైడేను డ్రైడేగా పాటిస్తూ ఆ రోజు ఇళ్లలో నిల్వ ఉంచిన నీటిని, నీటి తొట్టెల్లో ఉన్న నీటిని పారబోసి ఎండబెట్టాలి. తద్వారా దోమ లార్వా నశిస్తుంది. ఇలాంటి చర్యలతో మలేరియాను, డెంగీ వ్యాధులను అరికట్టవచ్చు.

జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారం మలేరియా కేసులు

సంవత్సరం	ప్రభుత్వ ఆస్పత్రుల్లో..	ప్రైవేటు ఆస్పత్రుల్లో..
2019	34	164
2020	11	94
2021	12	63
2023	01	12

నివారణ చర్యలు తీసుకుంటున్నాం



నెల్లూరును మలేరియా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దోమల నివారణకు నీరు నిల్వ ఉన్న గుంతల్లో 4 లక్షల గాంబూసియా చేపలను వదిలాం. సమస్యాత్మక 209 గుంతలను గుర్తించి దోమల నివారణకు చర్యలు చేపట్టాం. ఫాగింగ్ మెషీన్లు కూడా పంచాయతీలకు పంపిణీ చేశాం. శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి లార్వా దశలోనే మలేరియాను అరికట్టేందుకు దోమలను నివారిస్తున్నాం.

– డాక్టర్ బ్రిజిత, జిల్లా మలేరియా నివారణాధికారి

అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- జేసీ రోణంకి కూర్మనాథ్



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): 'స్పందన' కార్యక్రమంలో అర్జీదారులు తెలిపిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జేసీ వినతులు స్వీకరించారు. అలాగే నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, డీఆర్వో వెంకటనారాయణమ్మ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ డీఎం వెంకటేశ్వర్లు, కార్మికశాఖ కమిషనర్ వెంకటేశ్వర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కనకదుర్గాభవాని, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ నాగరాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు మలిరెడ్డి కోటారెడ్డి, శిఖరం నరహరి, జంషీద్ తదితరులు వినతిపత్రం అందజేశారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరే విద్యార్థిని మృతికి కారణమని, విద్యార్థులపై ఎలాంటి పర్యవేక్షణ లేదని, అనుమతులు లేకుండా హాస్టళ్లు నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. అలాగే నెల్లూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా శాఖ ప్రతినిధులు ఎస్‌కే షారూఖ్, నసీమ్, శరణ్, విష్ణు తదితరులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లాలో అర్హత కలిగిన దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు గూడూరు వెంకటరమణయ్య, కూనపరెడ్డి అరుణ్ తదితరులు వినతిపత్రం అందజేశారు. వీఆర్ లా కళాశాల ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఆ కళాశాల పూర్వ విద్యార్థులు కోరారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

అల్లూరు: తన సొంత గ్రామమైన ఇస్కపల్లి అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు బీ.మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని శంభునిపాళెం, ఎస్సీకాలనీ, జవ్వాగు, ఎస్టీకాలనీ సాల్ట్ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో శ్రమించి సాగు చేసిన ఉప్పును విక్రయించుకునేందుకు సరైన మౌలిక వసతులు లేక, అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇస్కపల్లి పంచాయతీలోని ఉప్పు రైతుల కోసం రూ.2 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి మొదటి విడతగా రూ.48 లక్షల వ్యయంతో 8 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వేయించేలా కృషి చేస్తానన్నారు. వచ్చే వారంలోనే టెండర్లను పిలుస్తామని ఉప్పు రైతులకు భరోసా ఇచ్చారు.



జగనన్న కాలనీకి తన 8 ఎకరాల భూమి పత్రాలను తహసీల్దార్‌కు అందజేస్తున్న బీద మస్తాన్‌రావు

జగనన్న కాలనీకి 8 ఎకరాల కేటాయింపు

ఇస్కపల్లి పంచాయతీలో ఏ ఒక్క కుటుంబం ఇల్లు లేకుండా ఉండకూడదని తన సొంత నిధులతో 8 ఎకరాలను కొనుగోలు చేసి జగనన్న కాలనీ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని తెలుపుతూ 8 ఎకరాలకు సంబంధించిన డాక్యుమెంట్‌లను బీద మస్తాన్‌రావు తహసీల్దార్‌కు అందజేశారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, వైస్ ఎంపీపీ సురేంద్ర, సర్పంచ్ పాటి రంజిత్, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, కొండూరు శీనయ్య, సాధక్‌రెడ్డి, దాసరి పోలయ్య, ఇస్కపల్లి పంచాయతీ కాపులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

కావలి రూరల్: భారీ ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంలో పిడుగుపడి పాలకీర్తి బ్రహ్మయ్య(37) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కావలి రూరల్ మండలం రామచంద్రాపురం పొలాల్లో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ఎం.వెంకటరావు వివరాల మేరకు తాళ్లపాళెం పంచాయతీ కోటడవి ఎస్టీ కాలనీ చెందిన పాలకీర్తి బ్రహ్మయ్య – మాధవి దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి బాతులు మేపుకునేందుకు అదే పంచాయతీలో రామచంద్రాపురం వద్ద పొలాల్లో గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షం కురవడంతో పాటు పిడుగుపడి పొలాల్లో బాతుల వద్ద ఉన్న పాలకీర్తి బ్రహ్మయ్య మృతిచెందాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమవారం తెలిపారు.



బ్రహ్మయ్య మృతదేహం

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'స్పందన' ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన' కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా సైబర్ మోసాలు, ఆస్తి వివాదాలు, ఉద్యోగాల పేరిట మోసం, కుటుంబ కలహాలు, భర్త, అత్తింటి వేధింపులు, దొంగతనం కేసుల్లో రికవరీ లేదని తదితరాలపై అర్జీలు అందాయి. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా ప్రాంత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రెట్టింపు డబ్బులు వస్తాయని ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. చెడు వ్యసనాలకు బానిసై తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఆలుమగల విషయంలో తొందరపాటు చర్యలు తగవన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాలను చక్కదిద్దాలన్నారు. ఆస్తి వివాదాల్లో డీఎల్‌ఎస్‌ఏ నుంచి న్యాయపరమైన సలహాలు తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో నిర్లక్ష్యాన్ని వీడి దర్యాప్తును వేగవంతం చేయాలని, నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును రికవరీ చేయాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం స్పందనకు వచ్చిన అర్జీదారులకు భోజనాలు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సెల్–2 డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలి సమస్య వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

తల్లి మరణానికి తండ్రే కారణం

దుత్తలూరు: తమ తల్లి మరణానికి తండ్రే కారణమని చెప్పిన చిన్నారుల మాటలు విని ఆ గ్రామస్తులంతా తీవ్రంగా కలత చెందారు. వివరాలు.. దుత్తలూరు మండలం కమ్మవారిపాళేనికి చెందిన షేక్ నాగూర్‌బీ(32) – మస్తాన్ దంపతులు. గత 11 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. మస్తాన్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో రంజాన్ రోజున పూటుగా మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. తీవ్ర దుర్భాషలాడుతూ తండ్రే తన తల్లిని గొంతు నులిమి చంపేసినట్లు కూతురు నస్రీన్ తెలిపింది. సోమవారం నాగూర్‌బీ మృతదేహాన్ని మృతురాలి బంధువులు కమ్మవారిపాళేనికి తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. తల్లిని తండ్రే చంపేశాడని స్వయానా కూతురే ఏడుస్తూ చెప్పడం స్థానికులను కంటతడి పెట్టించింది. మస్తాన్‌కు మరొకరితో వివాహేతర సంబంధం ఉండడం వల్లే నాగూర్‌బీని హత మార్చాడని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మస్తాన్‌ను హైదరాబాద్‌లో పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కమ్మవారిపాళెంలో భర్త మస్తాన్ ఇంటి వద్ద రోడ్డు మీద మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగడంతో సమాచారం అందుకున్న ఎస్సై బాజిరెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని విచారించారు. పోలీసులు కుటుంబసభ్యులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



స్థానికులకు నచ్చజెబుతున్న ఎస్సై



నాగూర్‌బీ పిల్లలు

రూ.60.61 కోట్ల విలువైన పొగాకు కొనుగోళ్లు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 4 రౌండ్ల వేలం ముగిసే సరికి రూ.60,61,64,461 విలువైన పొగాకు కొనుగోళ్లు జరిగాయని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ సోమవారం తెలిపారు. డీసీపల్లి వేలం కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మొత్తం 30,91,983 కిలోల పొగాకును రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వేలంలో మొత్తం 24,898 పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా, 23,267 బేళ్లు కొనుగోలు చేశామని, వివిధ కారణాల వల్ల 1,103 బేళ్లను తిరస్కరించామని తెలిపారు. మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారని, కిలో పొగాకు అత్యధిక ధర రూ.201, అత్యల్ప ధర రూ.174 చొప్పున లభించినట్లు తెలిపారు. కాగా మంగళవారం నుంచి మర్రిపాడు క్లస్టర్‌లో 5వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభమవుతుందని, ఒక్కో బ్యారెన్‌కు 4 బేళ్లు, అర బ్యారెన్‌కు 2 బేళ్లు చొప్పున మాత్రమే వేలానికి అనుమతిస్తామని తెలిపారు.



డీసీపల్లి వేలం కేంద్రంలో రైతులు విక్రయించిన పొగాకు బేళ్లు

ఎలక్ట్రానిక్ మీడియా విలేకరిపై పోలీస్ కేసు

జలదంకి: నూకల లోడ్‌తో వెళ్తున్న లారీని ఆపి రేషన్ బియ్యమంటూ డబ్బులు ఇవ్వాలని దందా చేసిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి(సాక్షి కాదు) కావలికి చెందిన శ్రావణ్‌పై సోమవారం జలదంకి పోలీసులు కేసు నమోదు చేశారు. రైస్ మిల్లు యజమాని, లారీ డ్రైవర్ నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కావలి మండలం మద్దూరుపాడు మట్టా వెంకట శివ సుబ్రహ్మణ్యం రైస్‌మిల్లు నుంచి నూకల లోడు కర్నూలు జిల్లా బనగానిపల్లికి వెళ్తుండగా మండలంలోని జమ్మలపాళెం వద్ద విలేకరి శ్రావణ్ ఆ లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారంటూ అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశాడు. లారీ డ్రైవర్ బిల్లులు చూపించినా వినకుండా లారీపైకి ఎక్కి పట్టా ఊడదీసి నానా రచ్చ చేశాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కావలి సీఎస్‌డీటీ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ సీఎస్‌డీటీ, పోలీసులు లారీలోని లోడును పరిశీలించగా నూకల లోడు అని తేలింది. దీంతో పోలీసులు ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 136

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30